# మొదలి వారి దర్శకత్వంలో నాటక ప్రయోగాలు

- డాక్టర్ డి.యస్.ఎన్. మూర్తి

నాటకంలో దర్శకుడు అనే వాడికి ప్రాముఖ్యం తెలుగు నాటక రంగంలో ఇప్పటికే పూర్తిగా రాలేదు. కేవలం ఒక నూట నలభైసంవత్సరాల క్రితం ప్రపంచ నాటక రంగంలోనే దర్శకుడు అనేవాడి అవసరం నాటక సంఘాలకే తెలిసొచ్చింది అప్పటినుండే రచయితలు రాసిన నాటకాలకి, తన అభిప్రాయం కూడా జోడించి సమగ్రమయిన, నాటక ప్రదర్శనలను ప్రేక్షకులకి అందిస్తున్నాడు దర్శకుడు. ఇవాళ మన దేశంలో కూడా అనేక రాష్ట్రాలలో దర్శకుడి చుట్టూ నాటకం తిరుగుతున్నది.

నాటక రంగంలో రచయిత ఒక్కడే Creative Artiste. మిగతా వారంతా అంటే, నటులు, సాంకేతిక నిపుణులు, దర్శకులు - వీరంతా Interpretative Artists. అంటే ఆ నాటకానికి అర్థం తెలియచెప్తారు. లేదా ఆ నాటకం మీద వ్యాఖ్యానం చేస్తారు. రచయిత ఉద్దేశాన్ని చెడగొట్టకుండా, తన అభిప్రాయంతో భాష్యం చెప్పేవాడు సరైన దర్శకుడు. అతని ప్రదర్శనలు గతంలో చేసినట్లు కాకుండా కొత్తరకంగా ఉంటాయ్. వీటిని ప్రయోగాత్మక ప్రదర్శనలు అనవచ్చు. ప్రయోగం అంటే గతంలో ప్రదర్శించిన పద్ధతిలోనే కాకుండా కొత్తరకంగా ప్రదర్శించడం. ఈ ప్రయోగం నాటక ప్రదర్శనలోని అన్ని శాఖలకు వర్తిస్తుంది. రచనలోనే ప్రయోగం ఉంటే అది ప్రదర్శనలోనూ కనిపిస్తుంది. తెలుగు నాటకరంగంలో ఇలా కొత్త తరహాలో నాటకాలు ప్రయోగిస్తున్న దర్శకులు చాలా తక్కువమందే అనే చెప్పుకోవాలి. అందులో ఆచార్య మొదలి నాగభూషణశర్మగారు మొదటి వరుసలో ఉంటారు. అయిన అనేక నాటకాలను ప్రయోగించారు. ఎక్కువగా అయన స్వీయరచనలనే ప్రయోగించడం వలన, రచన మీద పూర్తి సాధికారికత ఉండటంవలన దర్శకుడిగా పూర్తి న్యాయం చేయగలిగారు. విదేశీ భాషల ప్రముఖ నాటకాలని, ఇతర భారతీయ భాషల ప్రసిద్ధ రచయితల నాటకాలని ఆయన తెలుగులోకి అనువదించి మనకి అందించారు.

అందుకు మనమంతా ఆయనకి కృతజ్ఞులమై ఉండాలి. ఆయన దర్శకత్వం వహించి ప్రయోగించిన కొన్ని ప్రదర్శనలని ఇక్కడ విశ్లేషించే ప్రయత్నం చేస్తాను.

1936లో గుంటూరు జిల్లా ధూళిపూడి గ్రామంలో జన్మించిన నాగభూషణశర్మగారు పాఠశాల దశనుంచే రంగస్థలంతో పరిచయం పెంచుకున్నారు. విజయవాడ, బందరు పట్టణాలలో కాలేజీలో చదివే రోజులల్లో కూడా నాటకాన్ని వదలలేదు. హైదరాబాదులో ఎం.ఎ.,పిహెచ్.డి., అమెరికాలో ఎం.ఎఫ్.ఎ చదివిన శర్మగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లిషు శాఖ, నాటక శాఖలో అధ్యక్షుడిగా పని చేసి 1995 లో పదవీ విరమణ చేసారు. రచయితగా, దర్శకుడిగా, అధ్యాపకుడిగా, పత్రసమర్పకునిగా, ఉపన్యాసకునిగా- యిలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా శర్మగారు పేరుపొందారు.

**రాజా ఈడిపస్ :**

ప్రాచీన గ్రీకు రచయిత సోఫోక్లిజ్ (496-406 బిసి) రచించిన గొప్పవిషాదాంత నాటకం రాజా ఈడిపస్. ఈ నాటకాన్ని తెలుగులోకి అదే పేరుతో అనువదించి స్వీయ దర్శకత్వంలో మొదలి నాగభూషణశర్మగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం నాటకవిభాగం విద్యార్థుల చేత 1985లో ప్రదర్శింపజేసారు. ప్రాచీన గ్రీకు సమాజంలో

ఈడిపస్ కథ బాగా ప్రాచుర్యంలో ఉండేది. పుట్టినబిడ్డ వల్ల తనకు కీడుందని జ్యోతిష్యులు చెబితే ఆ బిడ్డను చంపెయ్యమంటాడు రాజు. పసిపిల్లాడిని చంపడం యిష్టంలేక పనివాడు పిల్లవాడిని మరో దేశం వాడికిస్తాడు. వాడు తన దేశరాజుకి ఆ పిల్లవాడి నిస్తాడు. పిల్లలులేని ఆ గిరిజననేత ఈ పిల్లాడిని భగవంతుని ప్రసాదంగా స్వీకరించి పెంచి పెద్ద చేస్తాడు. ఈడిపస్ అనే పేరుతో పెద్దవాడైన అతను కొన్ని సంఘటనల ద్వారా తన కన్నతండ్రి రాజ్యంలో ప్రవేశిస్తాడు. అనుకోని పరిస్థితుల్లో తండ్రిని వధించి అక్కడి చట్టాల ప్రకారం ఆ దేశపు రాజుగా ఎన్నుకోబడి చనిపోయిన రాజుభార్యను తన భార్యగా స్వీకరిస్తాడు. విధివశాత్తు ఈడిపస్ తెలియక ఆమె ద్వారా యిద్దరు పిల్లల్ని కంటాడు. ఆ రాజ్యంలో కరువుకాటకాలు, రోగాలు, ఆకలిచావులు ఎక్కువవుతాయి. దీనికి కారణం ఏమిటని ఆరా తీస్తే ఆ దేశంలో జరగరాని ఘోరం ఏదో జరిగిపోయిందని, దాన్ని సరిదిద్దకపోతే దేశం సర్వనాశనం అయిపోతుందని పండితులు చెబుతారు. చివరకు ఆ ఘోరం తనవల్లే జరిగిందని తెలుసుకున్న ఈడిపస్ తన కళ్ళను పెకిలించుకొని తనకి తానే శిక్ష విధించుకుంటాడు. అతని భార్యగా ఉన్న తల్లి ఆత్మహత్య చేసుకుంటుంది.

ప్రపంచ నాటక చరిత్రలో అతి గొప్ప నాటకంగా ప్రశంసలందుకున్న ఈ నాటకాన్ని నాగభూషణశర్మగారు ఒక చక్కని 'ఎన్విరాన్మెంట్'లో ప్రదర్శించారు. ప్రాచీన గ్రీకు వాతావరణాన్ని కళ్ళకు చూపించే, **హైదరాబాద్ కోఠి, ఉమెన్స్ కాలేజీలోని, రెసిడెన్సి భవనాన్ని ఈ నాటక ప్రదర్శనకు వేదికగా ఎంపిక చేసారు. ప్రాచీన ఆంగ్లోరోమన్ నిర్మాణ పద్ధతిలో ఈ భవనం నిర్మించబడింది. విశాలమైన వరండా. పెద్ద పెద్ద స్తంభాలు, భూమి నుండి వరండా దాకా 30 మెట్లు. మధ్యలో అమర్చబడిన శిల్పాలు – ఈడిపస్ నాటకం ప్రదర్శించడానికి అద్భుతంగా ఈ భవనం** తోడ్పడింది. బృందగాయకులు ప్రవేశించి, పాట పాడి నిష్క్రమించే సన్నివేశాలు ప్రేక్షకుల ముందు నేల మీద, మిగతా సన్నివేశాలు మెట్ల మీద, వరండా మీద ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో నాటకం చివర్లో ఈడిపస్ పతనాన్ని ఒకొక్క మెట్టుదిగి నేలమీద పడిపోయే సన్నివేశం సింబాలిక్‌గా ఉంది. విచిత్రమైన పరికరాలతో, సాంబ్రాణి ధూపాలతో, బృందగాయకుల ప్రవేశ, నిష్క్రమణలు ప్రాచీన గ్రీకు సంప్రదాయాన్ని సోఫోక్లిజ్ వర్ణించిన తీరులోనే ప్రదర్శించారు. ఆనాటి దుస్తులు, ఆయిధాలు, ఆభరణాలు, ఇతర వస్తువులు తగిన పరిశోధన చేసి ప్రత్యేకంగా సేకరించి ఈ ప్రదర్శనలో వాడారు. ఆధునిక తెలుగు నాటకరంగంలోనే కాక సమకాలీన భారతీయ నాటకరంగంలో యిదొక మంచి ప్రయోగంగా చెప్పుకోవచ్చు. మాములుగా ప్రొసీనియం రంగస్థలం మీద కాకుండా ఇలా పరిసరాల రంగస్థలంలో ఈ నాటకాన్ని ప్రయోగించడమే ఓ నూతన ప్రయోగం.

## నరజాతి చరిత్ర సమస్తం / దొరా నీ చావు మూడింది

ఇది కూడా ఎన్విరాన్మెంట్ థియేటర్ పద్ధతిలో మొదలి నాగభూషణ శర్మగారు అనువదించి స్వీయ దర్శకత్వంలో నాటకవిభాగం విద్యార్థులతో ప్రదర్శించబడింది. ఈ నాటకానికి మూలం "ఎంపరర్ జోన్స్" అనే, యుజిన్ ఒనిల్ రాసిన అమెరికన్ నాటకం. ఈ నాటకం అమెరికన్ నాటక సాహిత్యంలో వచ్చిన ప్రముఖ "Expressionistic" నాటకంగా పేరుపొందింది.

ఒక దీవిలో బ్రతకడానికి కొంతమంది కూలీలు వస్తారు. కొంత కాలం గడిచాక వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అందులోని ఓ బలిష్టుడు వాళ్లందరికీ తానే రాజుగా ప్రకటిస్తాడు. అతడిని రాజుగా వారంతా ఒప్పుకోగానే అతని దురాగతాలు ప్రారంభమవుతాయి. మానభంగాలు, వడ్డీవ్యాపారం, దుర్మార్గపు హత్యల మధ్య అక్కడి జనం బతుకుతుంటారు. కొల్లగొట్టిన ధనంతో చేస్తున్న పాపాలతో ఆ రాజుకు కళ్ళు కానరావు. ప్రజల్లోని

యువతలో ఓ ఆలోచన వస్తుంది. ఇతని ఆగడాలను భరించడం కంటే అతనికి ఎదురుతిరిగి అతన్ని చంపేసి మరో మంచివాడిని రాజుగా ఎన్నుకోవచ్చు అనుకుంటారు. తనమీద దాడిచేయడానికి వచ్చిన ప్రజల్లోని అమాయకత్వాన్ని అప్పుడు కూడా అనుకూలంగా మార్చుకుంటాడు రాజు. వారు తనని మామూలు ఆయుధాలతో చంపలేరని, కేవలం ఒక వెండి బుల్లెట్‌తో మాత్రమే తాను మరణించే వరం తనకుందని వాళ్ళను నమ్మిస్తాడు. తిరిగివెళ్ళిన జనం ఆలోచిస్తారు. ఏనాటికైనా తాము ఒక వెండి బులెట్ తయారుచేసి అతడిని చంపాలని శపథం చేస్తారు. తమ సంపాదనలో కొంత భాగం వెండి బుల్లెట్ తయారీకి దాచిపెట్టి చివరికి తయారుచేస్తారు. రాజును చంపగలమన్న సంతోషంతో వెండి బుల్లెట్‌ను ఊరేగింపుగా తీసుకొనివెళతారు. అది గమనించిన రాజు తనకి చావు తప్పదని తానింకా ప్రజల్ని మోసగించలేనని తెలుసుకొని చిక్కినంత సొమ్ము, నగలు మూటకట్టుకొని పారిపోతాడు. జనం అతడిని వెంబడిస్తారు. అడవిలో పరుగెడుతున్న అతడికి తాను చేసిన పాపాలన్నీ ఒకొక్కటిగా గుర్తుకొస్తాయి. అవన్నీ దృశ్యరూపంలో ప్రేక్షకులకు కనిపిస్తాయి. చివరకు దగ్గరవుతున్న జనాన్ని తప్పించుకోవడానికి వేగంగా ప్రవహిస్తున్న కాలువలోకి దూకి రాజు కొట్టుకుపోతాడు. ప్రజలంతా రాజు పీడ విరగడ అయిందని ఉత్సవాలు జరుపుకుంటారు.

ఈ నాటకాన్ని కూడా హైదరాబాద్ నిజాం కళాశాల ఆవరణలో వివిధ రంగస్థలాలను ఏర్పాటుచేసి ప్రదర్శించారు. నాటకపు ప్రారంభపు సన్నివేశం రాజభవనంలో జరుగుతుంది. మిగతావి ఆలయం, అడివి మొదలైన ప్రదేశాల్లో జరుగుతాయి. నాటకకథను చెప్పడానికి బృందగాయకులచేత జానపద కళారూపాలైన ఒగ్గుకథ, శారదకథ, పాటలను దర్శకుడు ప్రవేశపెట్టారు. ఈ బృందగాయకులు గిరిజన కట్టుబొట్టు, చేతిలో కత్తి, డాలు, పాట, నృత్యంతో కేవలం గాయకులుగానే కాకుండా కథలో పాత్రలవుతారు. వీరే, గ్రామస్తుల్లో కొందరిగాను, రాజును తరిమికొట్టే సన్నివేశంలోనూ పాల్గొంటారు. రాజు అడవిలోంచి పారిపోతున్నప్పుడు గతంలో అతనిచే మోసగించబడిన స్త్రీ, పురుష పాత్రలు అపసవ్యమైన రూపాలుగా ప్రేక్షకులకు కనిపిస్తారు. మొత్తానికి ఈ ప్రదర్శనలో వాస్తవికతావాదం, ప్రతీకవాదంతో పాటు జానపద కళారూపాలు, నృత్య సంగీతాలు అన్నీ మేళవించబడ్డాయి. శర్మగారు దర్శకత్వం వహించిన నాటకాల్లో ఇదొక మంచి ప్రయోగం. అయితే ఒక అమెరికన్ నాటకంలో మన ప్రాంతీయ జానపద కళారూపాలు ప్రవేశ పెట్టవచ్చా? అనే ప్రశ్నకు శర్మగారు ఒక ఇంటర్వ్యూలో ఇలా అన్నారు "ఇలా సంప్రదాయ కళారూపాన్ని నాటక ప్రయోగంలో వాడటం అవసరమా లేదా అనేది కథావస్తువుని బట్టి వస్తుంది. 'నరజాతి ....' నాటకానికి మూలమైన అమెరికన్ నాటకంలో ఇటువంటి ప్రక్రియ లేదు కాని నా ప్రేక్షకులకి ఇందులోని ప్రధానపాత్ర దిగజారిపోయే పరిస్థితులను బాగా హత్తుకుపోయేలా వివరించటానికి నేనే ఏదో ఒక ప్రత్యేకపద్ధతి అనుసరించాలి. పాత్రలన్నీ గిరిజనపాత్రలు. వారి భాష, ఆచారాలు అన్ని వైవిధ్యంగా ఉంటాయి. కనుకనే జానపద కళారూపాలను నాటకంలో ప్రవేశపెట్టాను. అది కథావస్తువుకి దగ్గరగా ఉంటుంది, ఉండాలి కూడా పైగా ఆ forms ని గురించి తెలియని నగర ప్రేక్షకులకి కూడా, అందులో కనిపించే గిరిజన కట్టు, బొట్టు, ఒక డాలు - ఒక కత్తి, పాట, నృత్యం మొదలైనవి వారిని ఆకట్టుకుంటాయి. అంతేగాక కథను వివరించడం, విశ్లేషించడం మొదలైనవి చూసి ప్రేక్షకులు ఆనందిస్తారు. అందుకే ఈ కళారూపాలు నాటకంలో ఒక భాగం అయ్యాయి."

## కాయితంపులి

1960 దశకంలో దేశంలో నక్సలైట్ ఉద్యమం ఊపందుకున్న తరుణంలో వామపక్ష భావాలను నాటకీయంగా ప్రముఖ హిందీ నాటక రచయిత శంకర శేష్ రాసిన“పోస్టర్” నాటకం ఆధారంగా రాయబడిన నాటకం “కాయితం పులి”. దీనిని తెలుగులో రాసింది, ప్రయోగించింది నాగభూషణశర్మగారే.

ధనవంతుడైన ఒక వ్యాపారి ఓ పెద్దకాంట్రాక్టు తీసుకుంటాడు. ఆ పని ఓ నాలుగు లేదా ఐదు సంవత్సరాల కాలం ఉంటుంది. ఆ చట్టుపక్కల గ్రామాలలోని చదువురాని గిరిజనులందరు వ్యాపారిదగ్గర కూలీలుగా చేరతారు. అడవుల్లోను, కొండల్లోను వాళ్ళు పనిచేయాలి. వారానికొకసారి కాస్త దూరంలో ఉన్న పెద్ద గ్రామానికి వెళ్లి వాళ్ళకు కావలసిన సరుకులు తెచ్చుకుంటారు. ఇలా తెచ్చుకున్న సరుకులు పొట్లాలు కట్టిన ఓ పెద్ద కాగితం మీద, ఓ పెద్ద బొమ్మ, కొన్ని అక్షరాలు కనిపిస్తాయి. చూడటానికి బాగుందని ఆ కాగితాన్ని ఒకడు తన గుడిసెముందు అతికిస్తాడు. కూలీడబ్బులు బట్వాడా చేయడానికి గుడిసెల దగ్గరకు వచ్చిన వ్యాపారిగుమాస్తా గుడిసెకు అంటించిన కాగితాన్ని చూసి గుండెలు బాదుకుంటూ వ్యాపారి దగ్గరకు వెళ్తాడు. హడావిడిగా వ్యాపారికూడా అక్కడికి వస్తాడు. కూలీలందరిని పిలిచి ఆ రోజు నుంచి కూలీలందరికి తలొక రూపాయి కూలీ పెంచుతానని చెబుతాడు. కూలీలంతా ఆనందిస్తారు. కానీ హఠాత్తుగా వ్యాపారి ఎందుకు కూలీ పెంచాడో అర్థంకాలేదు. ఆ ప్రాంతంలో కాస్త చదువుకున్న ఓ టీచర్ని పిలిచి గుడిసె మీద వున్న కాగితం చూసి అర్థం చెప్పమంటారు. అతను చదివి, అది, తమ కోర్కెలు తీర్చాలంటూ, కూలి పెంచాలంటూ కార్మికసంఘాలు నినాదాలు రాసిన కాగితంగా చెబుతాడు. అందుకు ఆ కూలీలు అటువంటిదే మరో కాగితం రాసిమ్మంటారు. టీచరు రాసిస్తాడు. మరునాడు గుడిసెల మీద రెండో కాగితం చూసిన వ్యాపారికి భయం పట్టుకుంటుంది. కూలీలమీద కోపం వస్తుంది. అలా క్రమంగా ఒక కార్మికసంఘం ఏర్పాటవడం, వాళ్ళు వ్యాపారి మీద తిరుగుబాటు చేసి విజయం సాధించడంతో నాటకం ముగుస్తుంది.

ఉత్తర భారతంలో, దేవాలయాల్లో యితర ముఖ్యమైన కూడళ్లలో కీర్తనలు పాడడం, భజనలు చేయడం అనాదిగా వస్తున్న అలవాటు, ఆచారం. దక్షిణాదిన ఉన్న హరికథ, శివకథ ప్రక్రియలలాంటిదే కీర్తనలు పాడడం. హరికథ చెప్పేవాడిని హరిదాసు అనేవిధంగానే కీర్తనలు పాడే వ్యక్తిని “కీర్తనకారుడు” అంటారు. కాయితంపులి నాటక ప్రయోగానికి కీర్తనకారుడి పాత్రను, కీర్తనలను, దర్శకుడిగా శర్మగారు చొప్పించారు. నిజానికి ఈ ప్రక్రియ హిందీ మూలంలో లేదు. ఇందులో కీర్తనకారుడి పాటలు నాటక గమనంలో మార్పులు తీసుకొస్తాయి. ఒక రంగం మారి మరో రంగానికి నాటకం ప్రవేశించినపుడు, ఒక మూడ్ మారి మరో మూడ్‌లోకి నాటకం వెళ్ళినపుడు ఈ కీర్తనలు అద్భుతంగా పనికొచ్చాయి. అంతేగాక ఈ నాటకంలోని కీర్తనకారుడి పాత్రను అమాయకపు గ్రామస్తులలో ఒక చైతన్యం తీసుకొచ్చే గురువుగా వాడుకున్నారు. ఈ ప్రదర్శనలో కీర్తనలను కేవలం సంగీతం కోసం వాడుకోకుండా ఒక నిర్దిష్టమైన ప్రయోజనం కోసం వాడుకోవడం వల్ల ఈ ప్రదర్శన ఒక అర్థవంతమైన ప్రయోగమయింది. అలాగే గిరిజనుల ఆటపాటలను, నృత్యరీతులను కూడా కూలీలు తమ సంతోషాన్ని వెలిబుచ్చే సందర్భంలో ఉపయోగించడం జరిగింది. సెంట్రల్ యూనివర్సిటీ థియేటర్, డాన్స్ విద్యార్థుల చేత మొదటిసారిగా ప్రదర్శింపజేసిన శర్మగారు తరువాత రసరంజని సంస్థ తరపున కూడా ప్రదర్శించారు. నాటకంలోవున్న ‘కంటెంటు’కు సరిపడావున్న ‘ఫామ్’ వాడుకున్నప్పుడు అది ఎంత మంచి ప్రయోగమవుతుందో ఈ నాటకం నిరూపిస్తుంది.

నాగభూషణశర్మగారు అమెరికాలో ఎం.ఎఫ్.ఎ. చదివి తిరిగివచ్చాక 'డ్రమటిక్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్' అనే సంస్థకు దర్శకుడిగా దాదాపు 8 నాటకాలను ఇంగ్లీషు భాషలో ప్రదర్శించారు. ఇవన్నీకూడా చాలా ప్రయోగాత్మకంగా ప్రదర్శించబడ్డవే. గిరీష్ కర్నాడ్ రచించిన తుగ్లక్ నాటకాన్ని, ఒక కొండలున్న ప్రదేశంలో, ఒక కొండలో వివిధ భాగాలను సమతులం చేసి, వివిధ రంగస్థలాల మీద వేరు వేరు సన్నివేశాలను ప్రదర్శించారు. హైదరాబాద్‌లో ప్రదర్శించబడ్డ మొదటి పరిసరాల రంగస్థల ప్రదర్శన ఇదే. ఇది విజయవంతం కావడంతో కాబోలు పైన వివరించిన 'ఈడిపస్', 'నరజాతి' మొదలైన నాటకాలను కూడా అదే శైలిలో ప్రయోగించారు.

ఇదే సంస్థకి శర్మగారు దర్శకత్వం చేసిన మరో ఇంగ్లీష్ నాటకం 'ది విజిట్'. Fredritch Dureanmatt అనే స్విస్ రచయిత రచించిన ఈ నాటకం, ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నంచేసిన ఓ స్త్రీ చుట్టూ తిరుగుతుంది. అద్భుతమైన నాటకీయత ఉన్న ఈ నాటకాన్ని దర్శకుడు రంగస్థలం మీద రెండు levels అమర్చి 'Symbolic' శైలిలో ప్రదర్శించారు. ఇదే సంస్థద్వారా సంస్కృతనాటకం మృచ్ఛకటికాన్ని The Clay Cart గానూ, ఇంకా మరికొన్ని నాటకాలని ప్రయోగించారు. గిరీష్ కర్నాడ్ 'హయవదన' నాటకంలో సంభాషణలు ఇంగ్లీషులో ఉంటే, పాటలు సంస్కృతం, తెలుగు భాషల్లో ఉంటాయి. సింబాలిజం శైలిలో ప్రదర్శించిన ఈ జానపద కథని కూడా ప్రేక్షకులు హర్షించారు.

హైదరాబాదులోని 'రసరంజని' సంస్థకు కూడా శర్మగారు అనేక నాటకాలు వివిధ శైలులలో ప్రదర్శించారు. అందులో ప్రధానంగా చెప్పుకోతగ్గది 'ప్రజానాయకుడు ప్రకాశం'. టంగుటూరి ప్రకాశం పంతులుగారి ఆత్మకథ ఆధారంగా శర్మగారు స్వయంగా రచించి, స్వీయదర్శకత్వంలో 50కి పైగా ప్రదర్శనలు రాష్ట్రవ్యాప్తంగాను, ఇతర రాష్ట్రాలలోనూ విజయవంతంగా ప్రదర్శించారు. ఆత్మకథని రంగస్థలం మీద ప్రదర్శించడం తెలుగు నాటకరంగంలో నాకు తెలిసి ఇదే మొదటి ప్రయోగం కావచ్చు. ఒక మహానాయకుడి జీవితాన్ని Period Play గా చూపించారు ఈ ప్రదర్శనలో. ఆయా కాలాలకు, ప్రాంతాలకు తగ్గ దుస్తులు, పరికరాలు, రంగాలంకరణ ఈ ప్రదర్శనలో కనిపిస్తాయి.

రసరంజని సంస్థ ద్వారా శర్మగారు ప్రయోగించిన ఓ Social Fantacy 'రేపటి స్వర్గం'. సంస్కృత నాటకమైన 'ముద్రారాక్షసం', తెలుగులో ప్రదర్శించిన 'హయవదన', నాటకవిభాగం విద్యార్థుల ద్వారా ప్రదర్శించిన Henrik Ibsen నాటకం An enemy of the People, తెలుగులో వారే అనువదించిన 'ప్రజల మనిషి', విజయ్ టెండూల్కర్ మరాఠి నాటకం 'నిశబ్దం కోర్టు నడుస్తుంది' మొదలయినవన్నీ శర్మగారి దర్శకత్వంలో విజయవంతంగా ప్రదర్శింపబడ్డవే.

Henrik Ibsen నాటకం - Dolls House తెలుగులో 'బొమ్మరిల్లు'గానూ, Bertolt Brecht రచన Caucasius Chalk Circle తెల్లసున్నా గానూ, Samuel Becket రచన Waiting for Godot తెలుగులో 'దేవుడయ్యి ఒస్తాడంట- శర్మ గారి చేతిలో ప్రదర్శనలకి సిద్ధంగా ఉన్నాయ్. వీటిని తన దర్శకత్వంలోనే ప్రయోగించాలని మాస్టారి కోరిక. త్వరలోనే వాటిని మనం చూడాలని కోరుకుంటున్నా.